# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

బుధవారం | 26 | ఆగస్టు | 2026 | పేజీలు: 8


## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం



7 లో




# సర్ విచారణలో... వాస్తవ నిర్ధారణకే ప్రాధాన్యం

పి.మీరాహుస్సేన్ ఖాన్

- నోటీసులపై అత్యంత పారదర్శకంగా విచారణ
- అర్హత ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కు పరిరక్షణ
- అధికారుల సమన్వయంతో సజావుగా సర్ ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో పర్యటించిన రోల్ అబ్జర్వర్ ఎంవీ శేషగిరిబాబు

3 లో

-విజయవాడ, మనంబ్యూరో




## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు

8 లో

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి

- ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా చూడాలి
- సమర్పించిన దరఖాస్తులు, ఆధారాలను పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



5 లో

## పీడబ్ల్యూఎన్ఎస్ఏటీ-2026లో
# విద్యార్థులకు ఉచిత విద్య, వసతి



**గాంధీనగర్ ఆగస్టు 25 మనం న్యూస్:** జేఈఈ, నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మద్దతుగా ఫిజిక్స్ వాలా నిర్వహిస్తున్న వార్షిక 'ఫిజిక్స్ వాలా నేషనల్ స్కాలర్షిప్ కమ్ అడ్మిషన్ టెస్ట్'ను పూర్తిగా తెలుగులో 'ఫిజిక్స్ వాలా జాతీయ ఉపకార వేతన ప్రవేశ పరీక్ష'గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు 5 నుంచి 12వ తరగతి విద్యార్థులతో పాటు 12వ తరగతి ఉత్తీర్ణులు ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం లేదా జీవశాస్త్ర విభాగాల విద్యార్థులు అర్హులు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు 100 శాతం వరకు విద్యా ఫీజు మినహాయింపు, మొత్తం రూ.2.5 కోట్ల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. అలాగే అర్హత సాధించిన తొలి 500 మంది విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు సంస్థ తెలిపింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షను ఆన్లైన్, ప్రత్యక్ష విధానాల్లో నిర్వహించనున్నారు. ఆన్లైన్ పరీక్ష అక్టోబర్ 1 నుంచి 15 వరకు, ప్రత్యక్ష పరీక్షలు అక్టోబర్ 3, 4, 10, 11 తేదీల్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యాపీఠ్, పాఠశాల, శిక్షణ కేంద్రాల్లో జరుగుతాయి. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి జేఈఈ, నీట్ సన్నద్ధత కోసం ప్రత్యేక మెంటార్షిప్, విద్యాపరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా నాణ్యమైన విద్యను అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకుడు, సీఈఓ అలఖ్ పాండే తెలిపారు.

# కోటక్ బిజ్ల్యాబ్స్ సీజన్-3 ద్వారా 100కుపైగా స్టార్టప్లకు మద్దతు

**గాంధీనగర్ ఆగస్టు 25 మనం న్యూస్:** ప్రారంభ, ఆదాయ దశలో ఉన్న స్టార్టప్లకు మద్దతుగా కోటక్ మహీంద్రా బ్యాంక్ చేపట్టిన 'కోటక్ బిజ్ల్యాబ్స్ యాక్సిలరేటర్' కార్యక్రమం మూడో సీజన్ జాతీయ స్థాయికి విస్తరించింది. ఆగస్టు 2026 నుంచి అక్టోబర్ 2027 వరకు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 100కుపైగా స్టార్టప్లకు మార్గదర్శకత్వం, పరిశ్రమలతో అనుసంధానం, నిధుల సహకారం అందించనున్నారు. తూర్పు, ఈశాన్య భారతదేశంలో కార్యక్రమం విస్తరణకు ఐఐఎం కలకత్తా ఇన్నోవేషన్ పార్క్ కొత్త ఇంక్యుబేషన్ భాగస్వామిగా చేరింది. సీజన్-3లో ఐఐఎం కలకత్తా ఇన్నోవేషన్ పార్క్, సీఎఐఐఈ ఇనిషియేటివ్స్, ఐఐఎం బెంగళూరు ఎన్ఎస్ఆర్సీఈఎల్, టీ-హబ్, ఐఐటీ ఢిల్లీ ఎఫ్ఐటీసీ భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. అగ్రిటెక్, వాతావరణ సాంకేతికత, ఆర్థిక సాంకేతికత, ఆరోగ్య సాంకేతికత, విద్యా సాంకేతికత, స్వచ్ఛ ఇంధనం, వ్యర్థాల నిర్వహణ, సుస్థిర తయారీ వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి




నుంచి దేశవ్యాప్తంగా 4,500కుపైగా దరఖాస్తులు అందగా, 125కుపైగా అధిక సామర్థ్యం ఉన్న సంస్థలను వేగవంతం చేసి, 100కుపైగా స్టార్టప్లకు గ్రాంట్లు అందించారు. సీజన్-3కు డీపీఐఐటీ గుర్తింపు పొందిన అర్హత కలిగిన స్టార్టప్లు దరఖాస్తు చేసుకోవచ్చని కోటక్ తెలిపింది. ఎంపికైన సంస్థలకు మెంటార్షిప్, పరిశ్రమల అనుసంధానం, వ్యాపార వృద్ధికి అవసరమైన సహకారం అందించనున్నారు.

## ఎన్టీఆర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా వీరంకి ఎన్నిక



**నందిగామ,ఆగష్టు25(మనం న్యూస్):** నందిగామ నియోజకవర్గంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘంలో కూడా వివాదరహితుడుగా మరొక్కసారి నిరూపించుకున్న వీరంకి వీరాస్వామి. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్ర గౌడ సంఘ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా నందిగామ నియోజకవర్గానికి చెందిన వీరంకి వీరాస్వామిని ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ అధ్యక్ష పదవి అనేది కేవలం ఒక పదవి కాదు అది మన సమాజానికి సేవ చేసే బాధ్యత అని,తమ కులంతో పాటు ఇతర కులాలను గౌరవించాలని వీరాస్వామి పేర్కొన్నారు. గౌడ కులం ఐక్యతకు అభివృద్ధికి భవిష్యత్తు తరాల సంక్షేమానికి ఎన్నిక ఎంతో ముఖ్యమైనదనీ, ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అవగాహన కల్పించి మన హక్కుల కోసం ఐక్యంగా చట్టబద్ధంగా పోరాడదాం అనీ, యువతకు విద్య,ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంబంధిత స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి మాట్లాడి వారి సహకారం తీసుకుని కృషి చేస్తానని వీరాస్వామి పేర్కొన్నారు. ఈ ఎన్నిక కు సహకరించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు ఆంధ్రప్రదేశ్ ఆర్టిసి కార్పొరేషన్ చైర్మన్ కొనకళ్ళ నారాయణకి, మరియు గౌడ సంఘ వ్యవస్థాపకులు చలపాటి వెంకటేశ్వరరావుకి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామారావుకి, కొనకల్ల రెడ్డమ్మకి, మరియు శివరామకృష్ణకి, మరియు గౌడ సంఘ పెద్దలకు అందరికీ పేరుపేరునా హృదయపూర్వకంగా నమస్కారాలు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అనీ వీరస్వామి పేర్కొన్నారు.




**క్రషర్ కాలుష్యం బారినబడి అల్లాడుతున్న కేతన కొండ గ్రామ రైతాంగం ఆవేదన**

**తక్షణమే అధికారులు స్పందించి రైతాంగానికి న్యాయం చేయాలి**

**ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ టిడిపి మాజీ వార్డ్ నెంబర్ సభ్యుడు పత్రి బాబురావు**

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు,25,(మనం న్యూస్):** పచ్చటి పంట పొలాల మధ్యలో శ్రీ గోపాల్ స్టోన్ క్రషర్ ఏర్పాటు వల్ల దాని నుంచి వచ్చే బూడిద కాలుష్యం వల్ల మా పొలాలు నాశనమవుతున్నాయి మమ్మల్ని కాలుష్య బారి నుండి కాపాడండి మహాప్రభో అంటూ కేతనకొండ టిడిపి మాజీ వార్డ్ నెంబర్ పత్రి బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాల క్రితం క్రషర్ నెలకొల్పిన సందర్భంలోనూ ప్రక్కన ఉన్నటువంటి పొలాల యజమానుల అంగీకారం తీసుకోవాల్సి ఉన్నా, అటువంటి వాటన్నింటిని తుంగలో తొక్కి క్రషర్ ను నెలకొల్పారని, ఈరోజు చూస్తే క్రషర్ నుండి వచ్చే కాలుష్యం వలన పంటలు పండే పరిస్థితి లేకుండా పోయిందని, ఆరుగాలం ఎంతో శ్రమ పడి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినా పంట చేతికి వచ్చే సమయానికి బూడిద పడటం వలన పంట చేతికి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సరే పొలం అయినా అమ్ముకొని పక్కన ఎక్కడన్నా వ్యవసాయం చేసుకుందామనుకున్నా ఇక్కడ రెండు కోట్లు ఉన్న పొలాన్ని క్రషర్ యజమాని 20 లక్షలకు ఇస్తావా 30 లక్షలకు ఇస్తావా అని బేరమాడుతున్నాడని అదేమంటే ఈ కాలుష్యం లో ఎక్కడకు ఎవరు వచ్చింది ఈ పొలం కొంటారని బెదిరిస్తున్నాడని, తాను తెలుగుదేశం పుట్టినప్పటి నుండి తెలుగుదేశం పార్టీకి సేవ చేస్తున్నానని గతంలో వైసిపి అధికారం సమయంలో కూడా వార్డు మెంబర్ గా ఇక్కడ 45 ఓట్ల మెజార్టీతో గెలుపొందానని, కానీ ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికార సమయంలో వైసీపీ నాయకులు ఏర్పాటు చేసినటువంటి క్రషర్ వలన ఇబ్బందులు ఉన్నాయి మహాప్రబో అని అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా, వేడుకున్నా కనికరించే వారు కనిపించడం లేదని అన్నారు. వైసిపి అధికార సమయంలో వైసీపీతో పోరాడిన మేము ఈనాడు తెలుగుదేశం పార్టీ అధికార సమయంలో కూడా పోరాడాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు మేల్కొని రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు.

# ఎనిమిదేళ్ల బదిలీ చేయగల వారంటీతో ఎస్కార్ట్స్ బోటా కొత్త ట్రాక్టర్లు

**గుంటూరు ఆగస్టు 25 మనం న్యూస్:** ఎస్కార్ట్స్ కుబోటా లిమిటెడ్ 45 హెచ్పీ సామర్థ్యం గల కుబోటా ఎంయూ4502, 50 హెచ్పీ సామర్థ్యం గల కుబోటా ఎంయూ5002 రెండు కొత్త ట్రాక్టర్ మోడళ్లను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టింది. భారతీయ ట్రాక్టర్ మార్కెట్లో కీలకమైన 41-50 హెచ్పీ విభాగంలో కంపెనీ ప్రీమియం యుటిలిటీ ట్రాక్టర్ శ్రేణిని ఇవి మరింత బలోపేతం చేయనున్నాయి. పరిశ్రమలోనే తొలిసారిగా ఈ రెండు మోడళ్లకు ఎనిమిదేళ్ల బదిలీ చేయగల వారంటీని అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. యాజమాన్యం మారినా వారంటీ ట్రాక్టర్తోనే కొనసాగుతుందని పేర్కొంది. కుబోటా క్యూక్యూపీ4 జపనీస్ ఇంజిన్తో పాటు 12 ఫార్వర్డ్, 4 రివర్స్ గేర్ల మల్టీ-స్పీడ్ సింక్రోమెష్ గేర్బాక్సును వీటిలో అమర్చారు. డీఎస్ఎస్ సాంకేతికతతో కూడిన పోంపా లిఫ్ట్ ఎగుడుదిగుడు నేలపైనా వ్యవసాయ పనిముట్లను స్థిరంగా ఉంచేందుకు దోహదపడుతుందని కంపెనీ తెలిపింది. పూర్తిస్థాయి ఎల్ఈడీ లైటింగ్, ఫ్లాట్ డెక్, ప్రీమియం బకెట్ సీటు, సస్పెండెడ్ పెడల్స్, పవర్ స్టీరింగ్, సౌకర్యవంతమైన నియంత్రణ వ్యవస్థ వంటి సదుపాయాలను అందించారు. వరి, గోధుమ, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, సోయాబీన్ తదితర పంటల సాగుతో పాటు రవాణా, వాణిజ్య పనులు, విత్తనాలు వేయడం, దుక్కి దున్నడం, బేలింగ్ వంటి వివిధ పనులకు ఇవి అనుకూలంగా ఉంటాయని కంపెనీ తెలిపింది. ఐదు ఎకరాలు, అంతకంటే ఎక్కువ భూమి కలిగిన రైతులతో పాటు కాంట్రాక్ట్ వ్యవసాయం, కస్టమ్ హైరింగ్ కార్యకలాపాలకు ఇవి ఉపయోగపడతాయని పేర్కొంది. ఎస్కార్ట్స్ కుబోటా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిఖిల్ నందా మాట్లాడుతూ 41-50 హెచ్పీ విభాగంలో తమ స్థానాన్ని




మరింత బలోపేతం చేసేందుకు కొత్త మోడళ్లు దోహదపడతాయని అన్నారు. డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అకిరా కాటో మాట్లాడుతూ జపనీస్ ఇంజినీరింగ్ సాంకేతికతతో దీర్ఘకాలిక పనితీరు, మన్నికను అందించేలా వీటిని రూపొందించామని తెలిపారు. ట్రాక్టర్ విభాగం చీఫ్ ఆఫీసర్ రాజన్ చుగ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల బదిలీ చేయగల వారంటీ రైతులకు దీర్ఘకాలిక భరోసాతో పాటు ట్రాక్టర్ పునర్విక్రయ విలువను కాపాడేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

# కార్మికులకు వేతనాలు పెంచి,సౌకర్యాలు కల్పించాలి

- **గండేపల్లి గ్రామపంచాయితీ కార్మికులకు వేతనాలు పెంచాలి**
- **ఇతర సమస్యలు పరిష్కరించాలి - (సిఐటియు)**
- **గండేపల్లి పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు సిఐటియు నాయకులు**

**కంచికచర్ల,(గండేపల్లి),ఆగష్టు25(మనం న్యూస్):** సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాల్, సిఐటియు కంచికచర్ల మండల నాయకులు గోపినాయక్ మాట్లాడుతూ గండేపల్లి గ్రామపంచాయతీలో పారిశుధ్యం నిర్వహణతో పాటు పలు విభాగాలలో కార్మికులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు.అనేక సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని పనిచేస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు,చట్టబద్ధ సౌకర్యాలు అమలుకావటం లేదు.మన పంచాయితీలో అతి తక్కువగా కేవలం రూ.6,000లు మాత్రమే ఇస్తున్నారు.ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు,విద్యా,_ వైద్యం, రవాణా తదితర ఖర్చులన్నీ విపరీతంగా పెరిగిపోయాయి .ఇప్పుడు ఇస్తున్న ఈ వేతనాలతో జీవనం గడపటం కష్టతరంగా మారింది.అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను గడపాల్సి వస్తున్నది.జిల్లాలో ఉన్న అనేక గ్రామ పంచాయితీల్లో రూ.12,000/-ల నుండి రూ.18,000/-ల వరకు వేతనాలు ఇస్తున్నారు. కావున పెరిగిన ధరలను పరిగణనలోకి తీసుకొని మన పంచాయితీలోని కార్మికులకు వేతనాలు వేతనాలు పెంచాలని, చట్టసౌకర్యాలు కల్పించాలని కోరుతున్నాము.1. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలి. 2. పియఫ్,ఇఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలి. 3. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి. 4. యూనిఫారమ్, సబ్బులు,చెప్పులు, కొబ్బరి నూనె ఇవ్వాలి. 5. హైకోర్టు తీర్పు ప్రకారం టెండర్ విధానం రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో గండేపల్లి గ్రామ పంచాయతీ పంచాయతీ కార్మికులు కోట ఆంజనేయులు, తిరుమలరావు,స టారపు నాగేశ్వరావు,శ్రీను నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# సర్ విచారణలో...
# వాస్తవ నిర్ధారణకే ప్రాధాన్యం

**నోటీసులపై అత్యంత పారదర్శకంగా విచారణ**
**అర్హత ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కు పరిరక్షణ**
**అధికారుల సమన్వయంతో సజావుగా సర్ ప్రక్రియ**
**క్షేత్రస్థాయిలో పర్యటించిన రోల్ అబ్జర్వర్ ఎంవీ శేషగిరిబాబు**

**(విజయవాడ,మనం బ్యూరో):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీచేసిన ఓటర్లకు సంబంధించి విచారణ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. నోటీసులో పేర్కొన్న అంశాలను సంబంధిత ఓటర్లకు వివరించి, వారి వివరణను పూర్తిగా విని, అవసరమైన ఆధారాలు, పత్రాలను పరిశీలిస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహించిన పరిశీలన, సమర్పించిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటున్నారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అయ్యప్పనగర్, మధ్య నియోజకవర్గంలో అజిత్సింగ్ నగర్లోని ఏఈఆర్వో కార్యాలయాల్లో ఐఏఎస్ అధికారి, రోల్ అబ్జర్వర్ ఎంవీ శేషగిరిబాబు.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి పర్యటించారు. సర్ నోటీసులపై జరుగుతున్న విచారణ ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ సమయంలో నోటీసులో పేర్కొన్న అంశాలపై వారి వివరణను పూర్తిగా వింటున్న తీరును పరిశీలించారు. ఓటర్లు సంబంధిత చిరునామాలో




నివసిస్తున్నారా, రికార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నాయా, అవసరమైన ఆధారాలు, పత్రాలు సమర్పిస్తున్నారా, అలాగే బీఎల్వోలు, అధికారుల ఫీల్ వెరిఫికేషన్ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటున్న విధానాన్ని సమీక్షించారు. గర్భిణీలు, మంచానికే పరిమితమైన వారు, ఆరోగ్య పరిస్థితుల కారణంగా విచారణకు హాజరు కాలేని ఓటర్లు, ఇతర రాష్ట్రాలు లేదా దేశాల్లో ఉన్న ఓటర్లు తదితర కేసుల్లో సంబంధిత వ్యక్తుల వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు అధికారులు చేపడుతున్న చర్యల గురించి అడిగారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే నియమనిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రక్రియలో భాగస్వాములయ్యేలా బీఎల్వోలు, క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించడమే ప్రక్రియ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని రోల్ అబ్జర్వర్ శేషగిరిబాబు స్పష్టం చేశారు.

**1,90,348 నోటీసుల పంపిణీ:**

ఇప్పటివరకు 1,90,348 నోటీసుల పంపిణీ జరగ్గా.. వీటిలో 75,471 మందికి విచారణ నిర్వహించడం జరిగింది. 58,895 మందికి విచారణ షెడ్యూలు గడువు ముగియగా విచారణ కోసం రీషెడ్యూల్ చేయడం జరుగుతోంది. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

# అక్రమ వాణిజ్య నెట్‌వర్క్‌లపై
# నిఘా ఆధారిత చర్యలు అవసరం




**గాంధీ నగర్ ఆగస్టు 25 మనం న్యూస్:** సరిహద్దుల ద్వారా జరుగుతున్న అక్రమ వాణిజ్యాన్ని అడ్డుకునేందుకు కేవలం అక్రమ వస్తువులను స్వాధీనం చేసుకోవడం కాకుండా, వాటి వెనుక పనిచేస్తున్న వ్యవస్థీకృత నేర నెట్వర్క్లను గుర్తించి ఛేదించాల్సిన అవసరం ఉందని ఆసియా సెక్యూరిటీ కాన్ఫరెన్స్-2026లో నిపుణులు పేర్కొన్నారు. అమలును బలోపేతం చేయడం, ఆవిష్కరణలకు సాధికారత కల్పించడం: బ్రాండ్ పరిరక్షణలో భారతదేశపు తదుపరి అధ్యాయం అనే అంశంపై జరిగిన సదస్సులో కస్టమ్స్, పోలీసులు, అంతర్జాతీయ సంస్థలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. అక్రమ వాణిజ్యంపై నిఘా ఆధారిత అమలు, డేటా విశ్లేషణ, కస్టమ్స్, పోలీసుల మధ్య సమాచార మార్పిడి, హక్కుదారులతో సమన్వయం కీలకమని నిపుణులు తెలిపారు. ఫిలిప్ మోరిస్ ఇంటర్నేషనల్ అక్రమ వాణిజ్య నివారణ డైరెక్టర్ రోడ్నీ వాన్ డూరెన్ మాట్లాడుతూ, ప్రతి స్వాధీనం ద్వారా లభించే సమాచారాన్ని వివిధ సంస్థలతో పంచుకుంటే నేర నెట్వర్క్లను ఛేదించేందుకు ఉపయోగపడు తుందని అన్నారు. భారతదేశంలో అక్రమ వాణిజ్యం విలువ ఏటా 231.5 బిలియన్ డాలర్లుగా అంచనా వేయబడిందని తెలిపారు. డిజిటల్ మార్గాల్లో చిన్న పార్శిళ్ల ద్వారా నకిలీ వస్తువుల రవాణా పెరుగుతోందని ఢిల్లీ పోలీస్ సైబర్ క్రైమ్ విభాగం ఏసీపీ స్వాగత్ పాటిల్ పేర్కొన్నారు. పోర్టు మార్పిడిని అరికట్టేందుకు లక్షిత తనిఖీలు, నిఘా ఆధారిత ప్రమాద అంచనా, కంటైనర్ స్కానింగ్, డేటా విశ్లేషణ, ఉమ్మడి శిక్షణ అవసరమని సమావేశం సూచించింది.

# ఫోటో జర్నలిస్టులు నూతన సాంకేతికతను అలవర్చుకోవాలి



**గాంధీనగర్ -ఆగస్టు 25 (మనం న్యూస్):** ఫోటో జర్నలిస్టు నైపుణ్యం, శ్రమ కలగలిసిన కళాకారుడని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నేషనల్ ఫోటో కాంటెస్ట్-2026 అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం విజయవాడ ప్రెస్క్లబ్లో నిర్వహించారు .కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆలపాటి సురేశ్కుమార్ మాట్లాడుతూ.. ఒక ఫోటో వార్తకు ప్రాణం పోస్తుందని అన్నారు. సంఘటనను చిత్రంతో పాటు వివరించడం ద్వారా విషయం పాఠకులకు మరింత చేరువవుతుందన్నారు. ఫిల్మ్ కెమెరాల నుంచి డిజిటల్, స్మార్ట్ఫోన్ కెమెరాల వరకు ఫోటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చాయని, ఆధునిక సాంకేతికతను ఫోటో జర్నలిస్టులు అందిపుచ్చుకోవాలని సూచించారు. సాధారణ వార్తా చిత్రాలతో పాటు కళాత్మక ఫోటోగ్రఫీని కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘటనలకు చేరువగా ఉండి, ఓపికగా నిరీక్షించడం ద్వారా ఫోటో జర్నలిస్టులు చారిత్రాత్మక చిత్రాలను ఆవిష్కరించగలరని పేర్కొన్నారు. సమాజంలో మార్పులు, ప్రజల జీవన విధానం, ప్రకృతి అందాలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫోటోగ్రఫీకి కీలక పాత్ర ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం సమాజంలోని సంఘటనలను భద్రపరచడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం కళ మాత్రమే కాదని, సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రజల ముందుకు తీసుకువచ్చే శక్తివంతమైన మాధ్యమమన్నారు. ఒక్క ఫోటో వెయ్యి మాటలను చెప్పగలదని, ప్రజా సమస్యలు, సామాజిక మార్పులు, ప్రకృతి వైభవాన్ని ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల ద్వారా ఆవిష్కరిస్తున్నారని చెప్పారు.ఏపీపీజేఏ అధ్యక్షుడు సీహెచ్వీఎస్ విజయభాస్కరరావు, జనరల్ సెక్రటరీ జి. మహేష్ మాట్లాడుతూ పోటీల్లో 15 రాష్ట్రాల నుంచి 110 మంది పాల్గొని 440 ఫోటోలను పంపారని తెలిపారు. జాతీయ స్థాయి ఇంగ్లిష్, ప్రాంతీయ పత్రికలు, న్యూస్ ఏజెన్సీల ఫోటో జర్నలిస్టుల నుంచి ఎంట్రీలు వచ్చాయని చెప్పారు. అవార్డులకు ఎంపికైన చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ను ముఖ్య అతిథులు తిలకించి ఫోటో జర్నలిస్టులను అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీజేఏ గౌరవ అధ్యక్షుడు జి.వి. నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. రూబిన్, కోశాధికారి సీహెచ్. నారాయణరావు, ఏపీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీ కె. జయరాజు, సీహెచ్.వి. మస్తాన్, ఏపీయూడబ్ల్యూజే నాయకులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఎస్.కె. బాబు తదితరులు పాల్గొన్నారు.



# నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగస్తులు, నాయకులు, మార్గదర్శకులు

**▸▸ ఏబీవీపీ మాజీ సంయుక్త కార్యదర్శి కేదార్నాథ్**

**నందిగామ,ఆగష్టు25(మనం న్యూస్):** విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలి సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకోవాలి తద్వారా సమాజానికి మార్గదర్శనం చేయాలి జాతీయ వాదశక్తి అఖిలభారతి విద్యార్థి పరిషత్ లో సభ్యత్వం తీసుకొని విద్యార్థులు యూనివర్సిటీలలో కాలేజీలలో సరి అయిన దిశగా విద్యాలోకం ఉండేటట్టుగా చర్యలు చేపట్టాలి తద్వారా ఒక ఉన్నతమైన సమాజం ఏర్పడుతుంది నేటి విద్యార్థులే రేపటి ఉద్యోగస్తులు నాయకులు మార్గదర్శకులు కాబట్టి విద్యార్థులు తమ యొక్క భవిష్యత్తు కోసం సరైన నిర్ణయాలు చేయాలి ఆత్మహత్య లాంటివి చేసుకోకుండా జీవితంలో పోరాటం నేర్చుకోవాలి ఆర్థికంగా స్థిరపడి తల్లిదండ్రులకు సమాజానికి దేశానికి సేవ చేయాలి అని ఏబీవీపీ మాజీ సంయుక్త కార్యదర్శి కేదార్నాథ్ తెలిపారు కందించర్ల ఖండ ఏబీవీపీ కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీ ఎన్నిక సందర్భంగా ఆయనా విద్యార్థులను కోరారు ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. లీగల్ కన్వీనర్ దుర్గారావు మాట్లాడుతూ ఏబీవీపీ ఒక జాతీయ విద్యార్థి శక్తి అని దేశమే లక్ష్యంగా సమాజ హితమే శ్రేయస్సుగా పనిచేస్తుందని రకరకాల అయినటువంటి సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సేవ చేయటమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారుకన్వీనర్ బజారు సుమంత్ కుమార్, మిక్ కాలేజీ,అల్లూరు గ్రామం, కో-కన్వీనర్ 1.చాట్ల జగదీశ్ మిక్ కాలేజీ,కంచికచర్ల, కో-కన్వీనర్,లక్కిశెట్టి దుర్గా ప్రసాద్,అమిత సాయి కాలేజీ, కంచికచర్ల మిగతా విద్యార్థులు అందరినీ సభ్యులుగా కంచికచర్ల ఖండ కమిటీ ఏర్పాటు చేయటం జరిగింది.



# జనన, మరణాల నమోదు చట్టంపై అవగాహన



**విస్సన్నపేట, ఆగష్టు25(మనం న్యూస్):** విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో జననాలు, మరణాల నమోదు సవరణ చట్టం-2026పై డిజిటల్ అసిస్టెంట్లు, మీ సేవా ఆపరేటర్లకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి తిరువూరు ఆర్డీవో ఎ.కుమార్, తహసీల్దార్, ఎంపీడీఓ హాజరయ్యారు. నూతన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూచించారు.

# కొండపర్వ బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో కుమార్



**విసన్నపేట,ఆగష్టు25(మనం న్యూస్):** విసన్నపేట మండలం కొండపర్వ బీసీ బాలికల హాస్టల్ను ఆర్డీవో కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లోని కిచెన్, ఆహార పదార్థాల నాణ్యత, హాస్టల్లో తాగునీటి సౌకర్యం, పరిసరాల పరిశుభ్రత, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని హాస్టల్ వార్డన్, సిబ్బందికి ఆర్డీవో సూచనలు చేశారు.

# డిమాండ్లు పరిష్కరించాలని తహసీల్దార్‌కు మెమోరాండం



**విస్సన్నపేట,ఆగష్టు25(మనం న్యూస్):** ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయు మండల కమిటీ ఆధ్వర్యంలో విస్సన్నపేట తహశీల్దార్ కార్యాలయం ముందు వివిధ డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ లక్ష్మీ కళ్యాణికి మెమోరాండం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానం చేసినటువంటి పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలను అర్హులైన వారందరికీ వెంటనే ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి త్యాగరాజు అన్నారు.

# ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**గుంటూరు ఆగస్టు : 25 (మనంప్రతినిధి):** వేమూరు మండలం జంపని గ్రామంలో నిర్వహించిన ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో వేమూరు శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు మరియు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసిర్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేసి,గ్రామ ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించారు. అనంతరం జంపని గ్రామంలోని తజుల్ ఔలియా దర్బార్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

# నందిగామ ఆర్టీసీ బస్టాండ్లో ఆటోలతో ఇబ్బందులు



**నందిగామ,ఆగష్టు25(మనం న్యూస్):** నందిగామ ఆర్టీసీ బస్టాండ్లో ఆటోలను ఇష్టారాజ్యంగా నిలుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే బస్టాండ్లో విద్యార్థులు, వృద్ధులకు అవస్థలు తప్పడం లేదు. బస్సులు నిలిచే ప్రాంతాల్లోనే ఆటోలు పార్క్ చేయడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన





**ఘనంగా జిల్లా స్థాయి కిసాన్ మేళా - 2026లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**

**మైలవరం ఆగస్టు 25 మనం న్యూస్ :** రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లోని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళా-2026 ఘనంగా జరిగింది. స్థానిక యస్.యస్. కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాసనస భ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు పాల్గొని రైతుల తో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. రైతులకు ఉపయోగకరంగా విజ్ఞాన ప్రదర్శన కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన శాఖ, పశు సంవర్ధక శాఖ, వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యా లయం, తిరుపతి, వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ పంటల శాస్త్రీయ సాగు విధానాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు, నూతన సాంకేతిక పద్ధతులు, విత్తనాల ఎంపిక, పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాలు, రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారు. వ్యవసాయం తో పాటు పాడి, పశు పోషణ, ఉద్యానవన రంగా ల్లో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశాలను కూడా అధికారులు వివరించారు.

## సేంద్రియ సాగుపై ప్రత్యేక అవగాహన

కిసాన్ మేళాలో సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించి, నేల ఆరోగ్యాన్ని కాపాడే సేంద్రియ పద్ధతుల ను రైతులు ప్రోత్సహించాల ని సూచించారు. సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేసి మంచి ఫలితాలు సాధించిన రైతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

వాతావరణ మార్పుల నేపథ్యంలో పంటలపై ఎల్నినో ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు సమయాల్లో మార్పులు, నీటి వినియోగంలో పొదుపు, పంటల సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా వాతావరణ ప్రతికూల ప్రభావాలను తగ్గించు కోవచ్చని నిపుణులు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, అనుబంధ శాఖల ప్రతినిధు లతో రైతులు ముఖాముఖి గా మాట్లాడి తమ సందే హాలను నివృత్తి చేసు కున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో వినియోగించు కోవడంతో పాటు శాస్త్రీయ, సేంద్రియ సాగు పద్ధతులను పాటించి వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. రైతులకు అవసరమైన విజ్ఞానం, సాంకేతికతను ఒకే వేదికపై అందించిన కిసాన్ మేళా-2026 రైతులకు ఎంతగానో ఉపయోగ పడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహన రావు (గాంధీ), వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్ర వేత్తలు, వివిధ అనుబంధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం... హోటళ్లు, రెస్టారెంట్లలో కిచెన్ పరిశుభ్రత తప్పనిసరి




**విజయవాడ,ఆగష్టు,25,(మనం న్యూస్):** ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హోటళ్లు, రెస్టారెంట్లు తమ వంటశాలలను (కిచెన్) పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం అధికారులు సూచించారు. మంగళవారం ఉదయం నక్కల రోడ్డు, బందర్ రోడ్డు, వన్ టౌన్ ప్రాంతాల్లో ప్రజారోగ్య అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటళ్లు, రెస్టారెంట్లలోని కిచెన్లు, ఆహార పదార్థాల తయారీ ప్రదేశాలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నిల్వ విధానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి హోటల్, రెస్టారెంట్లో ఉపయోగించిన కప్పులు, ప్లేట్లు, గ్లాసులను వేడి నీటితో స్టెరిలైజేషన్ చేసే విధానాన్ని పాటిస్తున్నారా లేదా పరిశీలించారు. అలాగే రక్షిత తాగునీటిని నిల్వ చేసే పాత్రలకు బిగుతైన మూతలు ఉన్నాయా, తయారు చేసిన ఆహార పదార్థాలను మూతలతో భద్రపరుస్తున్నారా అనే అంశాలను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను మూతలు లేకుండా ఉంచడం వల్ల ఈగలు, దుమ్ము, ఇతర కలుషిత పదార్థాలు చేరి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే అవకాశం ఉందని అధికారులు హోటల్ నిర్వాహకులకు సూచించారు. ప్రతి ఆహార పదార్థాన్ని పరిశుభ్రంగా, సురక్షితంగా నిల్వ చేయడంతో పాటు అన్ని ఆహార పాత్రలకు తప్పనిసరిగా మూతలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కిచెన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ, పాత్రల శుభ్రత, రక్షిత తాగునీటి నిర్వహణ వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించరాదని అధికారులు సూచించారు. పారిశుద్ధ్య మరియు ప్రజారోగ్య ప్రమాణాలను పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని అధికారులు హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో సానిటరీ సూపర్వైజర్లు సలీం అహ్మద్, రమేష్, సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నార



# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి



**▶▶ జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**పెనమలూరు: ఆగస్టు 25,(మనం న్యూస్):** ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. ఎలక్టోరల్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో నమోదైన అభ్యంతరాలు, క్లెయిమ్లపై మంగళవారం పెనమలూరు మండలం గోశాల గ్రామంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రజా విచారణను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అభ్యంతరాలు, క్లెయిమ్లు దాఖలు చేసిన ఓటర్లను కలెక్టర్ స్వయంగా విచారించి, వారి వాదనలు, అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర అంశాలకు సంబంధించి సమర్పించిన దరఖాస్తులు, ఆధారాలను పరిశీలించారు. ఎలక్టోరల్ వెరిఫికేషన్ ప్రక్రియలో ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్లు, ఒకే వ్యక్తికి సంబంధించిన బహుళ నమోదులు వంటి అంశాలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు తమ అభ్యంతరాలు, క్లెయిమ్లపై వాదనను స్వయంగా వినిపించే అవకాశం కల్పించాలని, వారు సమర్పించిన ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ప్రజా విచారణలో కలెక్టర్ తో పాటు ఉయ్యూరు ఆర్డీవో ఎస్ కరుణ కుమారి, ఎన్నికల సంబంధిత అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యూరులో తగ్గుముఖం పట్టిన డయేరియా లక్షణాల కేసులు



**▶▶ పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ అప్రమత్తత కొనసాగించాలి**

**▶▶ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**ఉయ్యూరు, ఆగస్టు 25,(మనం న్యూస్):** ఉయ్యూరు పట్టణంలో డయేరియా లక్షణాలతో నమోదైన కేసులు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, పరిస్థితి నియంత్రణలో ఉన్నప్పటికీ ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉయ్యూరు పట్టణంలోని 5వ వార్డు హరిజనవాడలో జిల్లా కలెక్టర్ పర్యటించి తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి సరఫరా విధానం, నీటి నాణ్యత, క్లోరినేషన్ ప్రక్రియ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా వాంతులు, విరేచనాలు, జ్వరం తదితర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్నారా అనే వివరాలను స్థానికుల నుంచి సేకరించారు.

### తాగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి

డయేరియా లక్షణాల కేసుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉయ్యూరు పట్టణంలోని అన్ని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల (,ఓహెచ్ఎస్ఆర్) వద్ద సూపర్ క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే డైరెక్ట్ పంపింగ్ సోర్సుల వద్ద డోజర్ల సహాయంతో ఇన్లైన్ క్లోరినేషన్ ప్రక్రియను అమలు చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ స్థాయిలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఇంటింటికీ ఫ్లోరింగ్ టాబ్లెట్ల పంపిణీ

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికీ ఆరోగ్య సర్వే నిర్వహిస్తూ, అవసరమైన మందులను అందిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి క్లోరిన్ టాబ్లెట్లను అందించనున్నారు అవసరమైన మందులు తదితరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య అధికారులు సూచించారు.

### సురక్షితమైన నీటినే వినియోగించాలి



ప్రజలు ప్రస్తుతం ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సూపర్ క్లోరినేషన్కు సంబంధించి అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది టాంటాం, మైక్ అనౌన్స్మెంట్ల ద్వారా అందించే సూచనలు, సలహాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలన్నారు.తాగునీటిని కాచి, చల్లార్చిన తర్వాత మాత్రమే సేవించాలని, సురక్షితమైన నీటిని వినియోగించడం ద్వారా నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నివారించవచ్చని అధికారులు సూచించారు.

### 22 కేసులు నమోదు – 17 మంది డిశ్చార్జ్

ఉయ్యూరు పట్టణ పరిధిలో ఇప్పటివరకు డయేరియా లక్షణాలతో 22 కేసులు నమోదు కాగా, వారిలో 17 మంది చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. మరో ఐదుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్న సంఘటన కారణంగా కేసులు తిరిగి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, తాగునీటి సరఫరా, క్లోరినేషన్ స్థాయిలు, వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డీసీహెచ్ఎస్, మున్సిపల్ సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీడిసిసి బ్యాంకు నందు నూతనంగా నియామకం పొందిన ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేసిన జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన



**గుంటూరు బ్రాడీపేట ఆగస్టు :25 (మనం న్యూస్ ప్రతినిధి)** జీడిసిసి బ్యాంకు నందు నూతనంగా నియామకం పొందిన ఉద్యోగులకు నియామక పత్రాలు. అందజేసిన జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మరియు బ్యాంక్ సీఈవో వివిఎస్ ఫణి కుమార్, ఇతర సీనియర్ అధికారులు. ఈ సందర్భంగా చైర్మన్ మక్కెన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో నిజాయితీ, క్రమశిక్షణ ,పారదర్శకత, సమయపాలన,సేవాభావం తప్పనిసరిగా ఉండాలని. బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడి గుంటూరు జిల్లా రైతాంగాని కి వారి అభివృద్ధికి మరియు సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

# నందిగామ ఓటర్ల జాబితా విడుదల



**నందిగామ,ఆగష్టు 25(మనం న్యూస్):** గ్రామపంచాయతీ 2026 ఎన్నికల ప్రక్రియలో భాగంగా నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా డ్రాఫ్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.ఎస్.హెచ్.వి.యం. ప్రసాదరావు రంగా మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# మధ్యవర్తిత్వంపై అవగాహన



**చందర్లపాడు,ఆగష్టు25(మనం న్యూస్):** చందర్లపాడు మండలం ముప్పాల గ్రామంలో గ్రామ సచివాలయం నందు మధ్యవర్తిత్వం యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాలు మరియు వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.కోర్టుల్లో కేసుల పెండింగ్ను తగ్గించడంతో పాటు, ఇరుపక్షాల సమ్మతితో త్వరితగతిన, స్నేహపూర్వకంగా మరియు ఖర్చు తగ్గించే విధంగా వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపినారు అనంతరం మొక్కలు నాటినారు ఈ కార్యక్రమంలో డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ ఎస్.వరలక్ష్మి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, బార్ అసోసియేషన్ సెక్రెటరీ చెరుకుమల్లి రామారావు, ఎస్త్ర ధర్మరాజు, మీడియేషన్ న్యాయవాది షేక్ ఆజాద్ న్యాయవాదులు కొనకంచి శ్రీనివాసరావు, కొమ్మినేని మాలేశ్వరరావు, అప్పాజీ, బెజవాడ గోపి, గ్రామ పెద్దలు నల్లని ప్రసాద్ రేళ్ళ కోటేశ్వరరావు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విజయవాడ కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు పశ్చిమ ఆగస్టు : 25 (మనం న్యూస్ ప్రతినిధి):** నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి,గళ్ళా రామచంద్రరావు,విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.దర్శనానంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు, మహిళలు,యువత మరియు అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, ప్రజలకు మరింత సంక్షేమం మరియు అభివృద్ధి ఫలాలు అందాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

# నందిగామ ఓటర్ల జాబితా విడుదల

గ్రామపంచాయతీ 2026 ఎన్నికల ప్రక్రియలో భాగంగా నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా డ్రాఫ్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.ఎస్.హెచ్.వి.యం. ప్రసాదరావు రంగా మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాను పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# ప్రతిభకు చిరు సత్కారం



మైలవరం ఆగష్టు 25 మనం న్యూస్ : స్థానిక మండలం పుల్లూరు శివారు కొత్తగూడెం గ్రామాని కి చెందిన సాయిరీ గోపాల రావుకు విదేశాలలో అరుదై న గౌరవం దక్కింది. పలు కార్యక్రమాల్లో సంగీత కళా కారునిగా జీవనం సాగి స్తున్న గోపాలరావు, థాయిలాండ్ దేశంలోని బ్యాంకాంగ్ లో శివ విహార దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమంలో అరుదైన గౌరవం దక్కింది. తెలుగు పాటలకు సంగీతం అందించి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్యాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. విదేశాలలో తెలుగు సాంస్కృతి సాంప్రదాయాలను చాటినందుకు పలువురు అభినందించారు.

# కొద్ది రోజుల నుంచి కుంభ గోవింద పై వస్తున్న కంప్లైంట్ లకు యాజ మాన్యానికి ఎటువంటి సంబంధం లేదు

మైలవరం ఆగష్టు 25 మనం న్యూస్ : స్థానిక నియోజక వర్గంలో పరిసర ప్రాంతాల్లో కుంభ గోవింద్ పై వస్తున్న ఫిర్యాదు లు వార్తల ప్రకారం మాకు చాలా చాలా బాధాకరంగా ఉంది. ఒక వ్యక్తి రికమండే షన్ మేరకు మేము అనా లోచినగా అతనికి అక్రిడేషన్ కార్డు ఇవ్వడం జరిగింది. ఇలా జరిగిన మరుక్షణమే మేము అతన్ని మా సంస్థ నుంచి తొలగించడం జరి గింది. ఇది మొదలుకొని మా పల్లె క్రాంతి తెలుగు దిన పత్రిక పేరు ఎవరైనా ఉప యోగించి దందాలకు పాల్ప డితే మేము పోలీస్ స్టేషన్ల లో క్రిమినల్ కేసులు పెట్టేం దుకు సిద్ధంగా ఉన్నా మని పల్లె క్రాంతి తెలుగు దిన పత్రిక యాజమాన్యం తరపున తెలియపరు స్తున్నాము.

## శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తుమాటి మాధవరావుకు శుభాకాంక్షలు తెలిపిన తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట ఆగస్టు 25 మనం న్యూస్ : శాసనమండలి డిప్యూటీ చైర్మన్ గా ఎంపికైన తు మాటి మాధవరావు ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి జగ్గయ్యపేట ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ తదితర నేతలతో కలిసి జగ్గ య్య పేట ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తుమాటి మాధవరావు కలిశారు. వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు అందించారు.

# బాపులపాడులో ముగిసిన జ్ఞానజ్యోతి కార్యక్రమం



హనుమాన్ జంక్షన్: ఆగస్ట్ 25 ( మనం న్యూస్ ): బాపులపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ లో 120 రోజుల జ్ఞానజ్యోతి కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి మండల అధికారులు సిబ్బంది సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. సి డి పి ఓ , మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ అధికారి జి. మంగమ్మ , ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించ బడింది.ఈ కార్యక్రమం ఆగస్ట్ 11 నుండి 13 వ తేదీ వరకు, ఆగస్ట్ 22 నుండి 25 వ తేదీ వరకు నిర్వహించారు. ఆయా రోజుల్లో వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ పి, డి.దుర్గారావు,, కె. సుజ్ఞానం, కె. రజిత, బాపులపాడు మండలం సూపర్వైజర్ లు కె.శాంతి శిరీష, సుమిత్ర ,ఎం.ఝాన్సీ , తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం, ఆహారం, పిల్లల అభివృద్ధి, పరిశుభ్రత తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు.

# ఆంధ్ర యూనివర్సిటీలో సీటు సాధించిన కాకరవాయి విద్యార్థికి ఆర్యవైశ్య యువజన సంఘం రూ.10 వేల ఆర్థిక సహాయం

▸▸ ఎమ్మెల్యే రాజగోపాల్ చేతుల మీదుగా అందచేత



జగ్గయ్యపేట ఆగస్టు 25 మనం న్యూస్: వత్సవాయి మండలం, కాకరవాయి గ్రామానికి చెందిన విద్యార్థి కలక శ్రీచైతన్య ఆంధ్ర యూనివర్సిటీలో సి ఎస్ సి కోర్సులో 26 వేల ర్యాంక్ సాధించి సీటు పొందారు. అయితే ఉన్నత విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామ సొసైటీ చైర్మన్ ఏపూరి నాగశ్రీను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ వెంటనే స్థానిక జగ్గయ్యపేట ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులకు సమాచారం అందించి విద్యార్థికి సహాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన ఆర్యవైశ్య యువజన సంఘం ప్రతినిధులు నూకల బాలకృష్ణ, గెల్లా రాము, కొప్పు సుధాకర్, స్వామి శ్రీను, ఎమ్మెల్యే కార్యాలయానికి విచ్చేసి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదుగా రూ.10,000 నగదును విద్యార్థి శ్రీచైతన్యకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి శ్రీ చైతన్య ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎమ్మెల్యే రాజగోపాల్ ఆకాంక్షించారు. విద్యార్థికి ఆర్థికంగా అండగా నిలిచి, చదువుకు సహకరించిన ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదని, విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పేర్కొన్నారు.

# గంట్రాయి మెయిన్ పాఠశాలలో ఘనంగా మథర్ థెరిస్సా జయంతి వేడుకలు



జగ్గయ్యపేట ఆగస్టు 25 మనం న్యూస్: బుధవారం మదర్ తెరిసా జయంతిని పురస్కరించుకొని మండలంలోని గంట్రాయి గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల మెయిన్ నందు మదర్ తెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రదానోపా ద్యాయులు రమేష్ బాబు మాట్లాడుతూ 1910 ఆగస్టు 26 న యుగోస్లేవియాలో మథర్ థెరిస్సా జన్మించారని, ఆమె అసలు పేరు ఆగ్నేస్ గోన్యా బొజాక్ష్యూ అని.12ఏళ్ళ వయస్సులోనే ఆమె సేవకు అంకితమయ్యారని ,18 సంవత్సరాల వయస్సులో ఇల్లు వదిలి సిస్టర్స్ ఆఫ్ లోరెటో అనే ప్రచారకుల సంఘంలో చేరినారని చిన్నతనంలోనే భారతదేశం వచ్చిన మథర్ ఈ దేశంలోని కుష్టు ,ఆనాథ, పేద పిల్లల కోసం ఎన్నో సేవలు చేసారని. మనదేశంలో జన్మించిక పోయినప్పటికి భారతీయుల గుండెల్లో గూడు కట్టుకున్నారని ,ఈమె సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారతరత్న బిరుదును ఇచ్చి గౌరవించిందని ,1997సెప్టెంబరు.5 మథర్ మరణించారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు సుబ్బారావు, విజయలక్ష్మి, దేవదానం, పద్మావతమ్మ ,ముక్తేశ్వరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ అభయ ఆంజనేయస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



హనుమాన్ జంక్షన్: ఆగస్ట్ 25 ( మనం న్యూస్ ): హనుమాన్ జంక్షన్లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం ఉదయం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేసి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో దంపతులను సత్కరించారు. అనంతరం ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని యార్లగడ్డ వెంకట్రావు స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు,మట్టా శ్రీనివాసరావు ,కమిటీ సభ్యులు, గన్నవరం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు చింతల వెంకట శివ అప్పారావు,టౌన్ పార్టీ ప్రెసిడెంట్ అట్లూరి శ్రీనివాస్, మొవ్వా బుజ్జి స్థానిక నాయకులు,భక్తులు పాల్గొన్నారు..

# ముగ్గురు కమ్యూనిస్టు ఉద్యమ నేతల సంస్మరణ సభ




గుంటూరు: ఆగస్టు : 25 (మనం న్యూస్ ప్రతినిధి )సీపీఐ రైతు, కార్మిక ఉద్యమ నేత ఆలా నాగేశ్వరరావు, శాంతి,స్నేహ సంఘం నాయకులు పి.ఆర్. ప్రకాశ్రావు, అరసం నేత, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పూర్వ సంపాదకులు ఏటుకూరి ప్రసాద్ల సంస్మరణ సభను ఆగస్టు 26న సాయంత్రం 5 గంటలకు గుంటూరులోని కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. మంగళవారం మల్లయ్య లింగం భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.భారత కమ్యూనిస్టు పార్టీ కోసం, పేదలు, అట్టడుగు వర్గాల ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తూ అనేక ప్రజా పోరాటాలు నిర్వహించిన ఈ ముగ్గురు నేతలను స్మరించుకోవడం గర్వకారణమన్నారు.వారి సేవలను స్మరించుకునే భాగంగా సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మేధావులు, అభ్యుదయ రచయితలు, కార్మిక,కర్షక నేతలు, సీపీఐ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు.సిపిఐ మహా ఉద్యమంలో భాగంగా ఢిల్లీ బహిరంగ సభకు గుంటూరు నుంచి భారీగా తరలివెళ్తాం. సిపిఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకీటి అరుణ్కుమార్ మాట్లాడుతూ. మార్పు కావాలి.మార్పు రావాలి అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన మహా ఉద్యమంలో భాగంగా గుంటూరు నగరంలో ప్రజలను చైతన్యపరుస్తూ పాదయాత్ర నిర్వహించామని తెలిపారు. అనంతరం ఈ నెల 17వ తేదీన పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ నిర్వహిస్తున్న ప్రజా పోరాటంలో గుంటూరు నగర సమితి నుంచి పెద్ద ఎత్తున పాల్గొంటామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు,జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య, బి.వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి నా బాధ్యత తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు ఆగస్టు : 25 (మనం న్యూస్ ప్రతినిధి ):** గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ రూ.31 లక్షలతో ఇంటర్ కళాశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.మంత్రి నారా లోకేశ్,కలెక్టర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదేళ్ల కాలంలో గుంటూరు ప్రభుత్వ మహిళా కాలేజీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, కాలేజీకి మహర్దశ తీసుకొచ్చే బాధ్యత తనదేనని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక మహిళా ఇంటర్ కళాశాలలో గ్రౌండ్ లెవలింగ్, ఇంటర్నల్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.31 లక్షలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన మహిళా కళాశాలను అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలకు మహర్దశ తీసుకొచ్చేందుకు సహకారం అందించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ సాయికాంత్ వర్మకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిండమే కాకుండా విద్యారంగంలో ఉన్నతంగా ఎదిగేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో అన్ని విభాగాలను బలోపేతం



చేస్తామన్నారు. ప్రపంచ దేశాలు మన వైపు చూడాలంటే విద్య ద్వారానే సాధ్యమని చెప్పారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం జవాబుదారీతనంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో అధ్యాపకులు నిబద్ధతతో పని చేస్తారని,ఇలాంటి గురువుల మార్గంలో విద్యార్థులు నడిచి కెరీర్ ను మలుచుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాలు పెంచేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గుంటూరు మహిళా కాలేజీలో విద్యనభ్యసించిన విద్యార్థినులు ఎన్నో విజయాలు సాధించారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇంటర్ లో చేరే టర్మీడియట్లో చేరే విద్యార్థినులకు 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, కూటమి నాయకులు పోతురాజు సమత,కొనకళ్ల సత్యం,చంద్ర, మండవ శ్రీనివాస్,శనక్కాయల రాజకుమారి,టీ పద్మావతి, వలి తదితరులు పాల్గొన్నారు.

# కోసూరి ప్రహ్లాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సామినేని ప్రశాంత్ బాబు



**జగ్గయ్యపేట ఆగస్టు 25 మనం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను అనుచరుడు, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జనసేన పార్టీ నాయకులు కోసూరి ప్రహ్లాద్ జన్మదినం సందర్భంగా జగ్గయ్యపేట జనసేన పార్టీ కార్యాలయం నందు జన్మదిన వేడుకల ను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు సామినేని ప్రశాంత్ బాబు పాల్గొని కేక్ కట్ చేయించి ప్రహ్లాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్ కొలగాని రాము , జనసేన పార్టీ మైనారిటీ నాయకులు షేక్ సత్తార్ , మాజీ కౌన్సిలర్స్ చారుగుండ్ల కొండా , శేషం ప్రసాద్ మరియు నాయకులు ఆవల భవాని ప్రసాద్ , అల్లూరి భాస్కరరావు , బండి నరేష్ , కీతా నవీన్ , గొర్రెపాటి సుదర్శన్ , పిఏ ప్రసాద్ , రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# మండలి డిప్యూటీ చైర్మన్ గా మాధవరావుని ఘనంగా సన్మానించిన ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల వై యస్ ఆర్ సీపీ కమ్మ సామాజిక వర్గం మాజీ ఎమ్మెల్యే లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు



గుంటూరు ఆగస్టు: 25 (మనం న్యూస్ ప్రతినిధి )ప్రజా సమస్యలపై గళం వినిపించే నేతను మండలి డిప్యూటీ చైర్మన్ గా నియమించడం అభినందనీయం అని మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం గుంటూరు లోని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు,స్వగృహం నందు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మండలి డిప్యూటీ చైర్మన్ గా మాధవరావు,ని ఉమ్మడి కృష్ణ, గుంటూరు,ప్రకాశం జిల్లాల వై యస్ ఆర్ సీపీ కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాశనమండలి సభ్యుడిగా వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రజా సమస్యలపై తన గళం వినిపించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి ఘనంగా తీసుకెళ్లిన తుమాటి మాధవరావు,ని మండలి డిప్యూటీ చైర్మన్ గా ఎంపిక చేయడం పట్ల కమ్మ సామాజిక వర్గం తరుపున వివిధ నియోజకవర్గాలకి సమన్వయకర్తలుగా ఉన్న మేమందరం వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై యస్ జగన్మోహన్ రెడ్డి,కి కృతజ్ఞతలు తెలియజేస్తూ మాధవరావు,కి అభినందనలు తెలియజేస్తున్నాం అన్నారు.వారు ప్రజా మన్ననలుపొంది మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మేమంతా ఆకాంక్షిస్తున్నామని పెదకూరపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు,తెలియజేసారు.ఈ కార్యక్రమం లో తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తున శివకుమార్, వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు,చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్,అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త చింతలపూడి అశోక్ కుమార్,ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవికుమార్,పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్,జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరావు, పాల్గొన్నారు.



# కళారూపాలతో సమాజంలో నైతిక విలువలు పెంపొందించాలి



**గుంటూరు ఆగస్టు: 25( మనం న్యూస్ ప్రతినిధి)** సమాజంలో నానాటికీ దిగజారుతున్న నైతిక విలువలను కళారూపాల ద్వారా పెంపొందించేందుకు కళాకారులు కృషి చేయాలని, ఐ పి టి ఏ జాతీయ కార్యదర్శి గని పిలుపునిచ్చారు. కళాకారుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిమంత కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా గని పాల్గొని ప్రసంగించారు.సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు కళాకారులు కంకణబద్ధులై పనిచేయాలని, అవినీతి నీతిగా చలామణి అవుతున్న పరిస్థితులను తమ కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. సాంస్కృతిక రంగానికి నిర్దిష్ట విధానాలు లేకపోవడం, కళాకారులకు సరైన సంక్షేమ కార్యక్రమాలు అమలు కాకపోవడంతో వారి పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏటా అందించే కళారత్న ఉగాది పురస్కారాల ఎంపికలో పారదర్శకత,నిజాయితీ పాటించి అర్హులైన కళాకారులకు మాత్రమే అవార్డులు అందించాలని అన్నారు.ప్రతి జిల్లా కేంద్రంలో కళాక్షేత్రాలు, మండల కేంద్రాల్లో ఓపెన్ థియేటర్లు నిర్మించాలని, సాంస్కృతిక శాఖ,ఎఫ్డీసీలను నిరంతరం క్రియాశీలంగా ఉంచాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన అర్హులైన ప్రతి పేద కళాకారుడికి నెలకు రూ.10 వేల పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో అరసం రాష్ట్ర నాయకులు శరత్చంద్ర జ్యోతి శ్రీ,గోలి సీతారామయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్,పల్నాడు ప్రజానాట్యమండలి కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, గుంటూరు జిల్లా నాయకులు కనపర్తి బెనహర్, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి పున్నయ్య, నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాస్తవ కు అందజేశారు.





# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం

**అమరావతి, ఆగస్టు 25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లా ప్రగడ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం విజయవాడ లోక్భవన్లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ఏపీ లోకాయుక్తగా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై జస్టిస్ మల్లిఖార్జునరావుకు అభినందనలు తెలిపారు. లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లోక్ భవన్ లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు గవర్నర్, ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.





# మైత్రి సినిమా కాంప్లెక్స్లో డ్రగ్స్ వద్దు బిడ్డా అవగాహన యాడ్ ఫిలిం ప్రివ్యూ షో ప్రారంభం



**▶▶ యువత, విద్యార్థులను డ్రగ్స్కు దూరంగా ఉంచడమే లక్ష్యం**

**గుంటూరు ఆగస్టు : 25 (మనం న్యూస్ ప్రతినిధి):**గుంటూరు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బిడ్డా అనే నినాదంతో రూపొందించిన రెండు నిమిషాల నిడివి గల అవగాహన యాడ్ ఫిలింను గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మైత్రి సినిమా కాంప్లెక్స్లో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ స్విచ్ ఆన్ చేసి ప్రివ్యూ షోను ప్రారంభించారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ ప్రోత్సాహంతో,సినీ దర్శకుడు దిలీప్ రాజా,నేతృత్వంలో ఈ అవగాహన యాడ్ ఫిలింను రూపొందించారు.యువత, విద్యార్థులను డ్రగ్స్కు దూరంగా ఉంచడంతో పాటు, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక, అలవాట్లు, స్నేహితుల వివరాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు గమనించేలా అవగాహన కల్పించడమే ఈ యాడ్ ఫిలిం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. డ్రగ్స్ ప్రభావం నుంచి యువతను కాపాడటమే లక్ష్యం.ఈ సందర్భంగా సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ, డ్రగ్స్కు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు యాడ్ ఫిలిం రూపొందించే అవకాశం కల్పించి,పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ యాడ్ ద్వారా విద్యార్థులు, యువతతో పాటు తల్లిదండ్రుల్లో కూడా అవగాహన పెరిగి, సమాజంలో సానుకూల మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీనియర్ నటుడు నరసింహరాజు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని, తనకు అవకాశం కల్పించిన జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు.రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ.మాట్లాడుతూ,గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ యువత సంక్షేమం,డ్రగ్స్ నియంత్రణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు.ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.గంజాయి మరియు డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ మాట్లాడుతూ ,విద్యార్థులు,యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలనే ఉద్దేశంతో సినీ దర్శకుడు దిలీప్ రాజా, తనను సంప్రదించారని తెలిపారు. వెంటనే పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సీనియర్ నటుడు నరసింహరాజు,ఇతర నటీనటుల సహకారంతో డ్రగ్స్ వద్దు బిడ్డాయాడ్ ఫిలిం అత్యంత చక్కగా రూపొందించబడిందని,దీని ద్వారా విద్యార్థులు, యువతలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెరుగుతుందని ఎస్పీ తెలిపారు.అన్ని అనుమతులు పూర్తయిన అనంతరం ఈ యాడ్ ఫిలింను సినిమా థియేటర్లతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృతంగా ప్రదర్శించి ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక,అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారు డ్రగ్స్కు ఆకర్షితులు కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి మరియు డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి.గుంటూరు జిల్లాలో గంజాయి అక్రమ రవాణా,విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీస్ శాఖ అనేక చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు గంజాయి వ్యాపారం, సరఫరా,విస్తరణకు పాల్పడుతున్న సుమారు 450 మందిని అరెస్టు చేసి, 141 కిలోల గంజాయి,4 కిలోల ద్రవ రూప గంజాయిని,5.783 ఎం డి ఎం ఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. 28, రౌడీ షీట్స్ 582 సస్పెక్ట్ సీట్స్ ఓపెన్ చేయడం జరిగింది రిపీటెడ్ గా గంజాయి వ్యాపారం చేస్తున్న 9 మందిని పిట్ ఎన్ డి పి ఎస్ చట్టం ద్వారా జైల్లో నిర్బంధించడం జరిగింది.అలాగే సంకల్పం 325 కార్యక్రమం ద్వారా కళాశాలల్లో 70 వేల మందికి పైగా విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించినట్లు తెలిపారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో పోలీసులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ,ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాసరావు, తెనాలి డీఎస్పీ శ్రీ బి. జనార్ధన్ రావు,ఈస్ట్ డీఎస్పీ టి. సీతారాం,సౌత్ డీఎస్పీ పూర్ణచంద్రరావు, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, నగరంపాలెం సీఐ మునిపల్లి రాజేష్, ఐటీ కోర్ సీఐ నిస్సార్ భాష,ఎస్పీ సీఐలు మల్లికార్జునరావు,ఎస్ఐలు రాంబాబు, రామచంద్రారెడ్డి, నగరంపాలెం పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు

**అమరావతి,ఆగస్టు 25,(మనం న్యూస్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సమక్షంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికింది.హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు పదవీ విరమణ చేయన న్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గోపాల కృష్ణారావు నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు.జస్టిస్ గోపాల కృష్ణారావు ఉమ్మడి కృష్ణా జిల్లా చల్లపల్లిలో 1964 ఆగస్టు30న జన్మించారని, చల్లపల్లి, మచిలీపట్నంల్లో పాఠశాల,కళాశాల విద్యను పూర్తి చేశారన్నారు.1989వ సంవత్సరంలో బార్ కౌన్సిల్ సభ్యుడిగా,న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారన్నారు.జనవరి 2023 లో హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని,2024 ఆగస్టులో ఏపీ హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు.జస్టిస్ గోపాల కృష్ణారావు తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని తెలిపారు. తదుపరి జిల్లా మరియు సెషన్స్ జడ్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు.పదవీ విరమణ అనంతరం జస్టిస్ గోపాల కృష్ణారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయునున్న జస్టిస్ గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా,న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు అదనపు సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి లు జస్టిస్ గోపాల కృష్ణారావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.











# ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

**గుంటూరు, ఆగస్టు 25: (మనం న్యూస్ ప్రతినిధి):**జిల్లా లోని ఈ.వి.యం గోడౌన్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక ఆర్ డి ఓ కార్యాలయం ఆవరణలో మరియు రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ఇ.వి.యం గోడౌన్ లను నెలవారీతనిఖీలలో భాగంగా పరిశీలించారు.ఈవీఎంలు భద్రపరిచిన గదుల వద్ద భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, గోడౌన్ తాళాలు,సీల్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని,భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి,గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు,ఇతర అధికారులు పాల్గొన్నారు.



